
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5

శ్రీ సత్యసాయి
జిల్లా వార్తలు
సోమవారం 10 మార్చి 2025



నారసింహుని చెంతకు.. నారా లోకేశ్

నేడు కదిరికి రానున్న మంత్రి

కదిరి, మార్చి9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మానవ వనరులు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్.. శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు రానున్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం జరగనున్న శ్రీవారి కల్యాణోత్సవానికి ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. మంత్రి హోదాలో ఆయన మొదటిసారిగా కదిరికి వస్తున్నారు. నవనారసింహ క్షేత్రాల్లో ఒక్కటైన కదిరి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు 15 రోజులపాటు వైభవంగా సాగుతాయి. బ్రహ్మోత్సవాల్లో కల్యాణోత్సవం గరుడ సేవ, మోహినీ ఉత్సవం, బ్రహ్మ రథోత్సవం వైభవంగా నిర్వహిస్తారు. నారసింహస్వామి కల్యాణోత్సవానికి ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు సమర్పించే సంప్రదాయాన్ని 2018లో టీడీపీ ప్రభుత్వం ప్రారంభించింది. అప్పటినుంచి సంప్రదాయం కొనసాగుతోంది.

కదిరి ప్రజల్లో ఆశలు

నారా లోకేశ్ ముచ్చటగా మూడోసారి కదిరికి వస్తున్నారు. యువగళం పాదయాత్రలో భాగంగా కదిరికి వచ్చారు. తరువాత ఎన్నికల ముందు మరోసారి పర్యటించారు. ప్రస్తుతం మంత్రి హోదాలో నరసింహస్వామి ఆలయానికి విచ్చేస్తున్నారు. యువగళం పాదయాత్రలో కదిరి ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ప్రవేశ ద్వారంగా ఉన్న కదిరి నియోజకవర్గం తనకల్లు మండలంలోని చీకటిమానుపల్లి సమీపాన 2023 మార్చి 17న నారా లోకేశ్‌కు ఘనంగా స్వాగతం పలికారు. లోకేశ్ పర్యటన ఈ ప్రాంత ప్రజల్లో ఎన్నో ఆశలు నింపింది. యుగవళం పాదయాత్ర సందర్భంగా గత వైసీపీ ప్రభుత్వంలో దగాపడిన ప్రజలు తమ సమస్యలు చెబుకున్నారు. వంద కిలోమీటర్లకు ఒక మైలురాయి చొప్పున యువగళం పాదయాత్రలో నారా లోకేశ్ వేస్తూ వచ్చారు. అందులో భాగంగా 600 కిలోమీటర్ల మైలురాయి రాట్రాపల్లి వద్ద ఏర్పాటు చేశారు. ఈప్రాంతాన్ని టెంపుల్ సర్క్యూట్‌గా గుర్తించి, రూ.వందకోట్లతో అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రసుత్తం ఆ హామీ అమలుపై కదిరి ప్రజలు ఆశలు పెట్టుకున్నారు. విద్యాపరంగా అత్యంత వెనుకబడిన కదిరికి ఇంజనీరింగ్ కళాశాల, ఆశ్రమ పాఠశాలలు, ఐటీ పరిశ్రమ అభివృద్ధి అత్యంత కీలకం. వీటికోసం కదిరి ప్రజలు ఎదురు చూస్తున్నారు. నారా లోకేశ్ సోమవారం సాయంత్రం 6గంటలకు కదిరికి చేరుకుని, 9గంటల వరకు శ్రీవారి కల్యాణోత్సవంలో పాల్గొననున్నారు. ఆయన ప్రత్యేక విమానంలో పుట్టపర్తికి చేరుకుని, అక్కడినుంచి రోడ్డుమార్గాన కదిరికి చేరుకోనున్నారు. శ్రీవారికి పట్టు వస్త్రాలు సమర్పించిన తరువాత ఆయన రోడ్డు మార్గాన కడప చేరుకుని, అక్కడి నుంచి తాడేపల్లికి వెళ్లనున్నట్లు షెడ్యూల్ ఖరారు చేశారు. మంత్రి హోదాలో శ్రీవారి కల్యాణోత్సవానికి హాజరవుతుండడంతో రాష్ట్ర వ్యాప్తంగా ప్రాధాన్యత సంతరించుకుంది. నారా లోకేశ్‌కు ఘనంగా స్వాగతం పలికేందుకు ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు.

టెంపుల్ సర్క్యూట్ అభివృద్ధికి అడుగులు పడేనా?

యువగళం పాదయాత్ర సందర్భంగా 600 కిలోమీటర్ల మైలురాయి వద్ద ఈప్రాంతాన్ని టెంపుల్ సర్క్యూట్‌గా ఏర్పాటు చేస్తామంటూ అందుకు సంబంధించిన శిలాఫలాకాన్ని నారా లోకేశ్ ఏర్పాటు చేశారు. కూటమి అధికారంలోకి రావడంతో టెంపుల్ సర్క్యూట్ ఏర్పాటుకు చర్యలు చేపడతారని ఈ ప్రాంత ప్రజలు భావిస్తున్నారు. కదిరి లక్ష్మీనరసింహస్వామి, కటారుపల్లి యోగివేమన, తిమ్మమ్మ మర్రిమాను, నల్లచెరువు పాలపాదిన్నె ఆంజనేయస్వామి, బట్రేపల్లి జలపాతం, ముత్యాలచెరువు పాలబావి తదితర ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పించి, టెంపుల్ టూరిజం అభివృద్ధికి పాటుపడుతారని ఆశిస్తున్నారు. కదిరిలో నరసింహస్వామి ఆలయానికి అనుబంధంగా భక్తులకు వసతులు కల్పిస్తే ఆ ప్రాంతం మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉందని ప్రజలు ఆశిస్తున్నారు.

ముచ్చటగా మూడోసారి సందర్శన
యువగళానికి జోష్ తెచ్చిన కదిరి ప్రజలు
టెంపుల్ సర్క్యూట్ అభివృద్ధిపై ఆశలు



నారా లోకేశ్ షెడ్యూల్ ఇదీ..

- సోమవారం మధ్యాహ్నం 4.20కి విజయవాడ విమానాశ్రమయం నుంచి బయల్దేరతారు.
- సాయంత్రం 5 గంటలకు సత్యసాయి విమానాశ్రయం చేరుకుంటారు.

5.15కి విమానాశ్రయం నుంచి కదిరికి ప్రయాణం

- 6.15కి కదిరిలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయం చేరుకుంటారు.
- 7 నుంచి 9 గంటల వరకు శ్రీవారి కల్యాణోత్సవంలో పాల్గొంటారు.
- 9గంటలకు శ్రీవారి దేవాలయం నుంచి కడపకు బయల్దేరి వెళ్తారు.

బ్రహ్మోత్సవాలకు శ్రీకారం

కదిరిలో శాస్త్రోక్తంగా అంకురార్పణ
నేడు ఖాద్రీశుడి కల్యాణోత్సవం


బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేస్తున్న అర్చకుడు

కదిరి, మార్చి 9(ఆంధ్రజ్యోతి): ఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టారు. యాగశాలలో ఆదివారం రాత్రి శాస్త్రోక్తంగా అంకురార్పణ చేశారు. పక్షం రోజులపాటు ఉత్సవాలు విజయవంతంగా పూర్తయ్యేలా చూడాలని అష్టదిక్పాలకులను వేడుకోవడం, ఉత్సవాలకు ముక్కోటి దేవతలను ఆహ్వానించే క్రతువునే అంకురార్పణ అంటారు. యాగశాలలో పుణ్యాహవచనం నిర్వహించారు. శ్రీవారి ఆలయంలో స్వామివారి సర్వ సైన్యాధ్యక్షుడైన విశ్వక్సేనుణ్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఈశాన్య దిక్కునకు వెళ్లి ఉత్సవాలకు ప్రారంభ సూచికగా విష్వక్సేనుల సమక్షంలో ప్రధానాచార్యులు భూమాత అనుగ్రహం కోసం పూజలు చేశారు. మట్టిని సేకరించి, యాగశాలకు చేరుకున్నారు. ప్రధానాచార్యుడు బ్రహ్మస్థానంలో ఉండి విశేష ఆరాధనలు చేశారు. యాగశాలలో నిత్యాగ్ని హోత్రాన్ని వెలిగించారు. ఉత్సవాలు ముగిసే వరకు ఈ హోత్రం వెలుగుతూనే ఉంటుంది. కల్యాణోత్సవం తరువాత శ్రీవారు యాగశాలలో కొలువు తీరుతారు. పుట్టమన్ను సేకరించి, యాగశాలలో నవధాన్యాలను మొలక పోశారు. ఇందులో మొలక ఏ దిక్కున ఎక్కువగా వస్తుందో ఆ వైపు పంటలు బాగా పండుతాయని భక్తుల నమ్మకం. అంకురార్పణ అనగా ప్రకృతి ఆరాధన, ప్రకృతి అనగా భూదేవీ అనగా స్త్రీ, అంటే ఏ పనిని ప్రారంభించాలన్నా మొదట స్త్రీలను పూజించి, వారిని ఆ కార్యక్రమంలో భాగస్వామ్యం చేయడం అనాదిగా వస్తున్న ఆచారం అని ఆలయ ప్రధాన అర్చకుడు నరసింహాచార్యులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

నేడు కల్యాణోత్సవం

బ్రహ్మోత్సవాల్లో అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి కల్యాణోత్సవం సోమవారం ఆలయ ప్రాంగణంలో కన్నులపండుగగా జరుగనుంది. అంతకు ముందు ఉదయం ధ్వజారోహణం నిర్వహిస్తారు. ఉత్సవాలకు అధిపతి అయిన గరుడాళ్వార్‌ను ధ్వజారోహణం గావించడమే ఈ వేడుక ప్రాముఖ్యత. నేడు ఆరోహణ గావించిన గరుడాళ్వార్‌ను ఉత్సవాలు ముగిసే వరకు అలాగే ఉంచి, తీర్థవాది రోజున అవరోహణం గావిస్తారు. తొలుత యాగశాల నుంచి శ్రీవారు, అమ్మవార్లను వేర్వేరుగా పల్లకీల్లో కల్యాణ మండపానికి తీసుకొస్తారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ శ్రీవారి కల్యాణం గావిస్తారు. నారసింహుని కల్యాణంలో కూడా తలంబ్రాలు పోసుకోవడం, వేడుకకు హాజరైన వారు వధూవరులకు చదివింపులు సమర్పించడం అనాదిగా వస్తోంది. శ్రీదేవీ, భూదేవి అమ్మవార్లతో నారసింహుడి కల్యాణం తిలకించడానికి ముక్కోటి దేవతలు విచ్చేస్తారని భక్తుల నమ్మకం.

రాష్ట్రపతికి ధర్మవరం డిజైనర్ కానుక


శాలువాను రాష్ట్రపతికి అందజేస్తున్న డిజైనర్ నాగరాజు

ధర్మవరం, మార్చి 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రపతి ద్రౌపది ముర్మకు పట్టణానికి చెందిన చేనేత డిజైనర్ అరుదైన కానుక అందించారు. న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో ఆదివారం రాష్ట్రపతి చిత్రంతో రూపొందించిన శాలువాను ఆమెకు బహూకరించారు. అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రపతి భవన్‌లో డిజైనర్ నాగరాజు, మరో చేనేత కార్మికుడు చిప్పల మార్కెండేయులు రూపొందించిన పట్టుచీరలను ప్రదర్శించారు. రాష్ట్రపతి ద్రౌపతి ముర్మ, గవర్నర్ అబ్దుల్ నజీర్ చేనేత పట్టుచీరలను తిలకించారు. వారికి పట్టుచీరలు, నేతన్నల నైపుణ్యం, ఆర్థిక స్థితిగతులను డిజైనర్ నాగరాజు వివరించారు.

తోలుబొమ్మల కళ అద్భుతం

నిమ్మలకుంట కళాకారుడికి రాష్ట్రపతి ప్రశంస

ధర్మవరంరూరల్, మార్చి9(ఆంధ్రజ్యోతి): మండలంలోని నిమ్మలకుంట గ్రామానికి చెందిన దళవాయి కుళ్లాయప్ప రూపొందించిన తోలుబొమ్మలను రాష్ట్రపతి ద్రౌపది ముర్మ ప్రశంసించారు. న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో ఏర్పాటు చేసిన వివిధా కా అమృత్ మహోత్సవంలో దళవాయి కుళ్లాయప్ప తోలుబొమ్మలతో ప్రత్యేక స్టాల్ ఏర్పాటు చేశారు. స్టాల్‌ను సందర్శించిన రాష్ట్రపతి తోలుపై గీసిన రామయాణ, భారత ఘట్టాలను పరిశీలించారు. అద్భుతం అంటూ ప్రశంసించారు. ప్రాచీన కళను కాపాడుకోవాలని రాష్ట్రపతి సూచించినట్లు దళవాయి కుళ్లాయప్ప తెలిపారు.


తోలుబొమ్మలను పరిశీలిస్తున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్మ

నేడు ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక

పుట్టపర్తిటౌన్, మార్చి9(ఆంధ్రజ్యోతి): స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ టీఎస్ చేతన్ ప్రకటనలో తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఉష్ణోగ్రతలు



గరిష్ఠం	37.0
కనిష్ఠం	22.0



	ఇఫ్తార్	సెహరీ
పుట్టపర్తి	6.34 సోమవారం సాయంత్రం	5.10 మంగళవారం ఉదయం
కదిరి	6.30 సోమవారం సాయంత్రం	5.12 మంగళవారం ఉదయం
ధర్మవరం	6.33 సోమవారం సాయంత్రం	5.09 మంగళవారం ఉదయం
హిందూపురం	6.33 సోమవారం సాయంత్రం	5.16 మంగళవారం ఉదయం
పెనుకొండ	6.33 సోమవారం సాయంత్రం	5.16 మంగళవారం ఉదయం



వరించిన పచ్చదనం

కనుచూపు మేర ఎటు చూసినా పచ్చదనమే. వరి కంకులతో కళకళలాడుతున్న పంట పొలాలే. ఆ పైరును చూసినా... పైరు మీద నుంచి వచ్చే గాలి తాకినా మనసుకు ఉల్లాసం కలుగుతుంది. ఇలాంటి అద్భుత దృశ్యం కరువుకు ఆలవాలమైన పెనుకొండ ప్రాంతంలో కనిపిస్తుండటం ఆశ్చర్యం కలిగిస్తుంది. ఇదంతా హంద్రీనీవా పుణ్యమే. పెనుకొండ మండలంలోని అడదాకులపల్లి చెరువు హంద్రీనీవా నీటితో నిండిపోయింది. చెరువు కింద ఆయకట్టులో వరి పంట ప్రాణం పోసుకుని ప్రకృతిని పచ్చగా మార్చేసింది. దాదాపు 150ఎకరాల్లో వరిని సాగుచేశారు. ఈ ప్రాంతంలో తొమ్మిదేళ్ల కిందట తాగడానికి కూడా నీరు దొరికేది కాదు. కానీ గత టీడీపీ పాలనలో గొల్లపల్లి రిజర్వాయర్‌ను నిర్మించారు. అక్కడి నుంచి హంద్రీనీవా కాలువతో చెరువులకు నీరిస్తుండటంతో కథ పూర్తిగా మారిపోయింది.

-ఆంధ్రజ్యోతి, హిందూపురం

ప్రయాణికులకు విజ్ఞప్తి..!

అభిప్రాయ సేకరణకు క్యూఆర్ కోడ్

కొత్తగా ప్రవేశపెట్టిన కూటమి ప్రభుత్వం

సమస్యలపై ఫిర్యాదు చేయవచ్చు



క్యూఆర్‌కోడ్‌ను స్కాన్ చేసి ప్రయాణికులకు చూపుతున్న కండక్టర్

ధర్మవరం, మార్చి 9(ఆంధ్రజ్యోతి): ప్రయాణాల్లో ఎదురయ్యే ఇబ్బందులు, అసౌకర్యాలు, సమస్యలను ప్రయాణికుల నుంచి తెలుసుకునేందుకు ఆర్టీసీ సరికొత్త విధానాన్ని అమలుల్లోకి తెచ్చింది. బస్సుల్లో ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించేందుకు క్యూఆర్‌కోడ్ విధానాన్ని ప్రవేశపెట్టింది. ఈ విధానం ద్వారా బస్టాండ్‌లో ప్రయాణికులకు కల్పిస్తున్న వసతులపై సమాచారం నేరుగా ఏపీ సర్వే సైట్‌కు చేరుతుంది. బస్టాండులో పరిశుభ్రత, తాగునీటి వసతి, మరుగుదొడ్లు, బస్సుల్లో వసతులు, సిబ్బంది పనితీరు ఇతరత్రా సౌకర్యాల కల్పనలో ఎలాంటి లోపాలున్నా ప్రయాణికులు ఆర్టీసీ అధికారులకు తెలిపేందుకు కూటమి ప్రభుత్వం ఈ విధానాన్ని అమల్లోకి తీసుకువచ్చింది. దీనికి సంబంధించి క్యూఆర్‌కోడ్ రూపొందించి విస్తృత ప్రచారం కల్పిస్తోంది. బస్టాండుల్లో ప్రయాణికులు కూర్చునేప్రాంతాలు, ప్లాట్‌ఫామ్‌లు, రిజర్వేషన్‌కౌంటర్, తాగునీటి కొళాయిలు ఇలా ప్రతిచోటా క్యూఆర్ కోడ్ చిత్రాలు ప్రదర్శిస్తున్నారు.

మొబైల్ ద్వారా

మొబైల్ ద్వారా క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయగానే ఏపీజీఓజీ సర్వేకామ్ అనే లింక్ ఓపెన్ అవుతుంది. అందులో ఆర్టీసీ బస్‌స్టేషన్‌పై సర్వే అని ఐదు అంశాలు ఉంటాయి. వాటిని పూర్తి చేసి సబ్‌మిట్ చేయగానే నేరుగా ఏపీ సర్వే సైట్‌కు ఫిర్యాదు చేరుతుంది.

ఇవీ అంశాలు

బస్‌స్టేషన్‌పై పూర్తి అనుభవాన్ని తెలుపగలరు. పరిశుభ్రత, కూర్చొనే సదుపాయం, నిరీక్షణ కేంద్రాలు, నిర్వహణతో మీరు సంతృప్తి చెందారా? తాగునీరు అందుబాటులో ఉందా? మరుగుదొడ్ల సౌకర్యం సరిగా ఉందా, బస్సుల షెడ్యూల్, రూట్ గురించిన సమాచారం స్పష్టంగా ప్రదర్శిస్తున్నారా అనే ప్రశ్నలకు అవును కాదు , బాగుంది, బాగులేదనే జవాబులు ఇవ్వాల్సిఉంటుంది. ఆయా వివరాలు ఉన్నతాధికారుల దృష్టికి చేరుతాయి. ఆ వెంటనే స్పందించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అధికారులు చెబుతున్నారు.

క్రైం న్యూస్

గొలుసు అపహరణ

బుక్కరాయసముద్రం, మార్చి 9(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బి.కొత్తపల్లి వద్ద వనజ అనే మహిళ మెడలో నుంచి బంగారు గొలుసును గుర్తు తెలియని దుండగుడు లాక్కెళ్లాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... అనంతపురం నగరానికి చెందిన రమేష్, అతడి భార్య వనజ శింగనమల మండలం లోలూరు వద్ద జాతీయ రహదారి పక్కనే హోటల్ నిర్వహిస్తున్నారు. ఆదివారం ఉదయం వనజ, ఆమె కుమార్తె అనంతపురంలో హోటల్‌కు సంబంధించి కూరగాయలు తీసుకున్నారు. గుత్తి రోడ్డుమీదగా హోటల్‌కు ద్విచక్రవాహనంలో బయల్దేరారు. బి.కొత్తపల్లి వద్దకు రాగానే గుర్తుతెలియని దుండగుడు బైక్‌లో వచ్చి వనజ మెడలో ఉన్న నాలుగు తులాల బంగారు గొలుసును అపహరించాడు. అనంతపురం నుంచే దుండగుడు వారిని అనుసరించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ కరణాకర్ బాధితురాలితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతపురంలో సీసీ కెమెరాల ద్వారా వీక్షించి కేసును వేగవంతం చేయనున్నట్లు సీఐ తెలిపారు.

ఈతకెళ్లి ఇద్దరు విద్యార్థుల మృతి



అయాన్, రిహాన్ మృతదేహాలు

హిందూపురం, మార్చి 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ముక్కడిపేటకు చెంది సుహేల్ కుమారుడు అయాన్ (11), ఆటోనగర్‌కు చెందిన జాకీర్ కుమారుడు రిహాన్(13) ఆదివారం ఈతకెళ్లి, చెరువులో మునిగి మరణించారు. హిందూపురం టూటౌన్ సీఐ కరీముల్లా తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అయాన్, రిహాన్ ఆరు, ఏడు తరగతులు చదువుతుండేవారు. ఇద్దరూ మిత్రులు. ఆదివార పాఠశాలకు సెలవు కావడంతో మధ్యాహ్నం ఆడుకుంటూ ఆటోనగర్ సమీపంలోని సడ్లపల్లి చెరువులోని గుంతలోకి ఈతకెళ్లారు. గుంతలో నీటి లోతును అంచనా వేయకుండా దిగి మునిగిపోయారు. నీటి కిందిభాగంలో బురద ఉండటంతో పైకి తేలే అవకాశం లేకుండాపోయింది. వారివెంట వెళ్లిన మరో బాలుడు నీటి కుంట నుంచి పరుగులు తీసి, ఆటో నగర్‌లో కుటుంబ సభ్యులకు విషయం చెప్పాడు. వారు వెంటనే నీటి గుంత వద్దకు చేరుకున్నారు. పోలీసులు, స్థానికులు తరలివెళ్లి నీటి కుంటలో విద్యార్థులను వెలికితీశారు. అప్పటికే ఇద్దరు మృతిచెందినట్లు సీఐ తెలిపారు. మృతదేహాలను హిందూపురం ఆస్పత్రికి తరలించి, పోలలీససులు కేసు నమోదు చేశారు. విద్యార్థుల మృతితో వారి కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

అయోమయం..!





అభ్యంతరాలను పరిశీలిస్తున్న డీఈఓ ప్రసాద్‌బాబు, వినతులు ఇస్తున్న ఉపాధ్యాయులు

టీచర్ల సీనియారిటీ జాబితాలో ట్విస్టులు

సీనియర్ల కంటే జూనియర్లే ముందుకు..

డీఎస్సీ, ర్యాంకు, మేనేజ్‌మెంట్‌లపై అభ్యంతరాలు

సైన్స్‌సెంటర్‌కు క్యూ కట్టిన ఉపాధ్యాయులు

నేటి సాయంత్రంతో గడువు పూర్తి

అనంతపురం విద్య, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): సీనియారిటీ జాబితాలో ఉపాధ్యాయులకు ట్విస్టులు కనిపిస్తున్నాయి. ముందుండాల్సిన సీనియర్ టీచర్లు జూనియర్ల కంటే వెనకున్నారు. డీఎస్సీ ఒకటే అయినా తక్కువ ర్యాంకు ఉన్న టీచర్ కంటే ఎక్కువ ర్యాంకు ఉన్న టీచర్లు జాబితాలో ముందు వరుసలో ఉన్నారు. టీచర్ల ర్యాంకులు, మేనేజ్‌మెంట్, సీనియారిటీ స్థానం, డీఎస్సీ ఇయర్ ఇలా పలు అంశాల్లో తప్పులు దొర్లాయని టీచర్లు, సంఘాల నేతలు గగ్గోలు పెడుతున్నారు. జిల్లా విద్యాశాఖ అధికారులు 15,059 మంది టీచర్లతో రూపొందించిన తాత్కాలిక సీనియారిటీ జాబితాలో అనేక పొరపాట్లు ఉన్నాయంటూ పెదవి విరుస్తున్నారు. మరోవైపు అధికారులు సైతం టీచర్లు ఇచ్చిన 'టిస్'లోనే అనేక తప్పులు నమోదు చేశారని, అందువల్లే ఈ తప్పులు వచ్చాయంటూ అధికారులు మండిపడుతున్నారు. వెరసి టీచర్లలో ఈ జాబితాపై అయోమయం నెలకొంది. సీనియారిటీ జాబితాపై ఈ నెల 4వ తేదీ నుంచి నుంచి ఇప్పటి వరకూ 455 వరకూ అభ్యంతరాలు వచ్చాయి. సోమవారం అభ్యంతరాల స్వీకరణకు ఆఖరి తేదీ.

ఒకరిపై ఒకరు నెపం

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 15059 మంది ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. ఇందులో సెకెండరీ గ్రేడ్ టీచర్లు 7307 మంది, స్కూల్ అసిస్టెంట్లు 6849 మంది, భాషాపండితులు 117 మంది, ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు 340 మంది, గ్రేడ్ -2 ప్రధానోపాధ్యాయులు 386 మంది, పీఈటీలు 60 మంది ఉన్నారు. టీచర్ల కోసం విద్యాశాఖ సీనియారిటీ లిస్టు రెడీ చేసింది. ముఖ్యంగా ఉమ్మడి జిల్లాల విద్యాశాఖాధికారులు టీచర్స్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (టిస్), టీచర్ల డీఎస్సీల ఆధారంగా తమ వద్ద ఉన్న సమాచారంతో సీనియారిటీ లిస్టు రెడీ చేశారు. ఇది తాత్కాలిక జాబితా మాత్రమే. వారం రోజుల పాటు జాబితాపై టీచర్ల నుంచి అభ్యంతరాలు స్వీకరించేందుకు విద్యా శాఖ గడువు ఇచ్చింది. జాబితాను బహిర్గతం చేయడంతో అందులో లోపాలు ఉన్నాయంటూ, అనేక తప్పులు దొర్లాయంటూ టీచర్లు మండి పడుతున్నారు. అయితే తప్పులు దొర్లడంపై అటు విద్యాశాఖ, ఇటు టీచర్లు ఒకరిపై ఒకరు నెట్టేసుకుంటున్నారు. డీఎస్సీల వారీగా రోస్టర్ కమ్ మెరిట్ జాబితాలు బయట పెట్టకపోవడంతోపాటు, వాటి ఆధారం గా అధికారులు లిస్టు రెడీ చేయలేదని సంఘాల నేతలు వాపోతున్నారు. అందువల్లే ఇన్ని తప్పులు దొర్లుతున్నాయని టీచర్లు, నేతలు అంటు న్నారు. మరోవైపు టీచర్లే 'టిస్'లో అడ్డదిడ్డంగా నమోదు చేశారని, సొంత ర్యాంకులు, మేనేజ్‌మెంట్, డీఎస్సీ వివరాలు కూడా పొరపాటుగా ఎంట్రీ చేశారంటూ అధికారుల నుంచి వాదన వినిపిస్తోంది.

ఆరు రోజుల్లో 455 అభ్యంతరాలు

ఈనెల 4 నుంచి అభ్యంతరాలు స్వీకరిస్తున్నారు. లిస్టులో అనేక పొరపాట్లు ఉన్నాయని టీచర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల టీచర్ల నుంచి అభ్యంతరాలి చ్చేందుకు గత ఆరు రోజుల్లో టీచర్లు పోటెత్తారు. ప్రధానంగా టీచర్లు పనిచేస్తున్న మేనేజ్‌మెంట్, డీఎస్సీ ర్యాంకులు, డీఎస్సీ ఇయర్ తప్పుగా నమోదు చేశారని, వాటిని మార్చాలంటూ టీచర్ల నుంచి వినతులు వస్తున్నాయి. ఇప్పటి వరకూ 455 అభ్యంతరాలు వచ్చాయి. ఇందులో స్కూల్ అసిస్టెంట్స్‌కు సంబంధించి 305 రాగా 45 పరిష్కరించారు. ఎస్‌జీటీల నుంచి 150 అభ్యంతరాలు రాగా 58 అభ్యంతరాలను పరిష్కరించారు. సోమవారం సాయంత్రం వరకూ గడువు ఉంది. ఆ సంఖ్య పెరిగే అవకాశం ఉంది.

అభ్యంతరాలన్నింటినీ పరిష్కరిస్తాం

ప్రస్తుతం రూపొందిస్తున్న టీచర్ల సీనియారిటీ లిస్టు చాలా కీలకమైనది. ఈనెల 4 నుంచి అభ్యంతరాలు స్వీకరిస్తున్నాం. ఇప్పటి వరకూ 455 వచ్చాయి. వాటిలో ఇప్పటికే 103 పరిష్కరించాము. సోమవారం సాయంత్రం వరకూ గడువు ఉంది. టీచర్ల నుంచి ఆధారాలతో లిఖితపూర్వకంగా వచ్చిన అభ్యంతరాలను ఒకటి, రెండు రోజుల్లో పరిష్కరిస్తాం. ఏ టీచర్‌కు అన్యాయం జరగకుండా చూస్తాం.

- ప్రసాద్‌బాబు, డీఈఓ, అనంతపురం

మహిళలు సమాజాన్ని శాసించాలి

- జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న



ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

అనంతపురం కల్చరల్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మహిళలు సమాజాన్ని శాసించే దిశగా రాణించాలని అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని అనంత మహిళా వేదిక ఆధ్వర్యంలో ఆదివారం కృష్ణకళామందిర్ నుంచి క్లాక్‌టవర్ మీదుగా సప్తగిరి సర్కిల్ వరకు భారీ ప్రదర్శన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో యువతులు, మహిళలు సమాజంలో మహిళ పాత్రపై ప్రదర్శనలు చేస్తూ ముందుకు సాగారు. అనంతరం లలితకళా పరిషత్‌లో డాక్టర్ ప్రసూన, న్యాయవాది గాజుల పద్మజ సంయుక్త అధ్యక్షతన మహిళా సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, మహిళా సామాజిక వేత్త దేవి, మహిళా ప్రాంగణం జిల్లా మేనేజర్ వనజా అక్కమ్మ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. తొలుత చిన్నారులు, మహిళలు శాస్త్రీయ నృత్యాలు, కోలాట ప్రదర్శనలు, నాటక ప్రదర్శనలతో అలరించారు. అనంతరం అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న మాట్లాడుతూ తాను ఓ మహిళగా ఐఏఎస్ చదివి, సమాజంలో అధికారిగా నిలవడానికి తన తల్లిదండ్రుల ప్రోత్సాహంతోపాటు పట్టుదల, ఉన్నత ఆశయంతోనే సాధ్యమైందన్నారు. మహిళా దినోత్సవం అనగానే తొలుత అందరి మదిలో మెదిలేది అమ్మేనని, మహిళ అంటే అంతటి గొప్పది అని పేర్కొన్నారు. మహిళా సామాజికవేత్త దేవి మాట్లాడుతూ 78 సంవత్సరాల స్వాతంత్ర్య భారతంలోనూ మహిళలకు సమాన హక్కులు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. వనజా అక్కమ్మ మాట్లాడుతూ ఒక కుటుంబం క్షేమం మహిళపైనే ఆధారపడి ఉంటుందని, కాబట్టి మహిళలు తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. అనంతరం వివిధ రంగాల్లో సేవలందిస్తున్న పలువురు మహిళలకు ప్రశంసా పత్రాలు, లక్ష్మి ఇండస్ట్రీస్ ఆధ్వర్యంలో చీరలు అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి, చంద్రిక, కెనరా బ్యాంకు రీజనల్ మేనేజర్ యాదయ్య, లక్ష్మి ఇండస్ట్రీస్ అధినేత సందీప్ కుమార్, రెడ్స్ భానుజా, ఇన్నర్‌వీల్ క్లబ్ జయంతి, శ్రీవల్లి, స్టాఫ్ నర్స్ అసోసియేషన్ లత, ఆర్ట్స్ కళాశాల అధ్యాపకులు బృంద, జేవీవీ నాయకురాలు లక్ష్మి, శశికళ, మాధవీలత, అంగన్వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి రమాదేవి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న

మహిళల ఆర్థిక స్వావలంబనకు సీఎం కృషి

టీడీపీ జిల్లా అధ్యక్షుడు

వెంకటశివుడు యాదవ్



అనంతపురం, మార్చి9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మహిళలు ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేయడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ అన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో ఆదివారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళలకు అత్యధిక గౌరవమిచ్చే పార్టీ తెలుగుదేశం అన్నారు. కూటమి ప్రభుత్వం మహిళల కోసం అనేక పథకాలను రూపొందించిందన్నారు. మహిళా సంక్షేమం, సాధికారత, భద్రత కోసం వివిధ సంస్థలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకొని అనేక పథకాలను ప్రారంభించిందన్నారు. లక్షమంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా తయారుచేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. రాష్ట్రంలోని మహిళలు, పిల్లల భద్రత కోసం శక్తి బృందాలను సీఎం ప్రారంభించారన్నారు. చేనేత రంగాన్ని పరుగులు పెట్టించేందుకు చేనేత రథాలను ప్రారంభించారన్నారు. ఇందుకుగానూ ప్రతి జిల్లాకు రూ.60 లక్షలు కేటాయించారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 1.5 లక్షల మంది మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లు పంపిణీ చేసే కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. రాష్ట్రంలో 7471 పట్టణ పేద మహిళలకు రూ. 645.52 కోట్లు బ్యాంకు రుణాలు పంపిణీ చేశారన్నారు. డ్వాక్రా ఉత్పత్తుల విక్రయానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఫ్లిప్ కార్ట్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుందన్నారు. వ్యవసాయ, వ్యవసాయేతర ఉత్పత్తులపై మహిళలకు వ్యాపార శిక్షణ అందించేందుకు డ్వాక్రా క్యాటలిస్ట్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్‌తో ఒప్పందంపై సంతకం చేయనుంద న్నారు. ఎంతోకాలంగా ఆశా వర్కర్లు డిమాండ్ చేస్తున్న గ్రాట్యుటీని సీఎం చంద్రబాబునాయుడు అమలు చేశారన్నారు. ఉద్యోగ విరమణ పొందిన, మరణించిన ఆశా వర్కర్లకు జూన్ 2024 నుంచి గ్రాట్యుటీ అమలు చేయబడుతుందన్నారు. మహిళల ఆర్థికాభివృద్ధే చంద్రబాబు లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.

వదాన్య టీంని ఆదర్శంగా తీసుకోవాలి

సినీ దర్శకుడు బీవీఎస్ రవి

ఘనంగా వదాన్య జన సొసైటీ బహుమతుల ప్రదానోత్సవం



విద్యార్థులకు చెక్కును అందజేస్తున్న అతిథులు, వదాన్య జన సొసైటీ సభ్యులు

అనంతపురం ప్రెస్‌క్లబ్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): నేటి యువత వదాన్య జన సొసైటీ సభ్యులను ఆదర్శంగా తీసుకోవాలని సినీ దర్శకుడు బీవీఎస్ రవి అన్నారు. వదాన్య జన సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎస్‌జీటీ మెగా గ్రాండ్ టెస్ట్, టాలెంట్ టెస్ట్‌లలో ప్రతిభ చూపిన పలువురు విద్యార్థులకు బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్డీటీ ఇంక్లూజివ్ సెంటర్‌లో ఆదివారం వదాన్య జనసొసైటీ వ్యవస్థాపకులు అశోక్ పడపాటి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి బీవీఎస్ రవి, ఆర్డీటీ మాంచో ఫెర్రర్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ 2024లో శ్రీసత్యసాయి జిల్లాలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో వదాన్య సొసైటీ టాలెంట్ టెస్ట్ నిర్వహించి, ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేయడం అభినందనీయమన్నారు. అనంతరం ప్రతిభ కనబరిచిన వి.మంజుల, విశ్వనాథ్, చెన్నారెడ్డి, నరసింహ, లోకేశ్, ఓబులేసుకు రూ.4 లక్షల విలువచేసే బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆర్డీటీ ఎకాలజీ సెంటర్ మల్లారెడ్డి, న్యాయవాది పుట్టపర్తి ప్రభాకర్‌రెడ్డి, రవికాంత్ రమణ, లెనిన్‌బాబు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో ఐదుగురికి గాయాలు

ధర్మవరం, మార్చి9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం కుక్కల దాడిలో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. దారి వెంట వెళ్తున్న వారిపై కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. లోనికోటకు చెందిన ఇమామ్‌హుస్సేన్, శారదానగర్‌కు చెందిన రెడ్డమ్మ, గాంధీనగర్ వాసి ప్రభాస్, గొట్లూరుకు చెందిన జీవన్‌కుమార్ అనే బాలుడితోపాటు మరొకరిపై కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. వారికి స్థానిక ప్రభుత్వాస్పత్రిలో వైద్య చికిత్సలు అందించారు. పట్టణ వీధుల్లో స్వైరవిహారం చేస్తున్న కుక్కలను నియంత్రించడానికి మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఏమైందో..?

గుర్తు తెలియని శవం

ఆచూకీ లభ్యం

జేబులోనే డబ్బులు

పోస్టుమార్టంతో ఆధారాలు దొరికేనా...?

అనంతపురం క్రైం,మార్చి9(ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని మృతదేహం ఆచూకీ దొరికింది. కుటుంబసభ్యులు గుర్తించారు. శనివారం రాత్రి నగరంలోని పాతూరులో బ్రహ్మంగారి గుడి సమీపంలో గుర్తుతెలియని మృతదేహాన్ని వన్‌టౌన్ పోలీసులు గుర్తించిన విషయం తెలిసిందే. నార్పల మండలం గడ్డంనాగేపల్లికి చెందిన జూటూరు ఓబులేసు(55)గా గుర్తించారు. గ్రామం నుంచి శనివారం మధ్యాహ్నం బయలుదేరిన ఓబులేసు అనంతపురం వచ్చాడు. బైక్ రిపేరీ ఉందని ఇంటి నుంచి వచ్చే సమయంలో రూ.20వేలు నగదు తీసుకొచ్చినట్లు తెలిసింది. ఏమైందో తెలియదు కానీ, రాత్రి 8గంటల సమయంలో వన్‌టౌన్ పోలీసులు రోడ్డుపక్కన బనియన్, డ్రాయర్‌తో ఉన్న మృతదేహాన్ని గుర్తించారు. కుటుంబ సభ్యులు మృతదేహాన్ని గుర్తించాక పోలీసులు పలు కోణాల్లో ఆరా తీశారు. రాత్రి 11గంటల సమయంలో చివరి సారి ఫోన్ రింగ్ అయిందనీ, లిఫ్ట్ చేయలేదని కుటుంబసభ్యులు.. పోలీసులకు తెలిపారు. ఈ క్రమంలో ఫోన్ నంబర్ ద్వారా లోకేషన్ గుర్తించగా.. గుత్తి రోడ్డులోని కేటీఆర్ ఫంక్షన్‌హాల్ వెనుక వైపు ఉన్నట్లు తెలిసింది. ఓబులేసును ఆటోలో దింపి వెళ్లారని భావిస్తున్నారు. ఓబులేసు వెంట తెచ్చుకున్న డబ్బు అతని డ్రాయర్‌లోనే ఉండటం గమనార్హం. చొక్కా, పంచె ఎక్కడికెళ్లాయనేది అంతుబట్టడం లేదు. మద్యం మత్తులో ఉన్న ఓబులేసును వదిలి వెళ్లారా..? ఇంకా ఏమైనా జరిగిందా..? అనే కోణంలో పోలీసులు ఆరాతీస్తున్నారు. సోమవారం పోస్టుమార్టం నిర్వహిస్తే విషయం తెలుస్తుందని సీఐ రాజేంద్రనాథ్ యాదవ్ తెలిపారు. మృతుడి భార్య శారద ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

టమోటా కిలో రూ. 8

అనంతపురం రూరల్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ. 8తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు ఆదివారం 225 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ. 7, కనిష్ఠ ధర రూ. 5 పలికినట్లు ఆయన తెలిపారు.

62 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లో తగ్గుతోంది. ఉమ్మడి జిల్లాకు హంద్రీనీవా పథకం కింద అందాల్సిన సాగు తాగునీరు పూర్తిస్థాయిలో నీటి విడుదల కావడంతో బంద్ చేశారు. రాగులపాడు ఎత్తిపోతల పథకంలో నిల్వ వున్న నీటిని మాత్రమే వదులుతున్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. ఇందులోభాగంగా ఆదివారం రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లో 62 క్యూసెక్కులు ఉన్నట్లు చెప్పారు. అలాగే ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2కు 45 క్యూసెక్కులు వెళుతున్నాయన్నారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 1.499 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు వెల్లడించారు.

విద్యార్థి అదృశ్యం



గౌతమ్

అనంతపురం క్రైం, మార్చి9(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఓ విద్యార్థి అదృశ్యమయ్యాడు. మూడో రోడ్డులో నివాసముంటున్న 14ఏళ్ల మణి గౌతమ్ ఒకటో రోడ్డులోని ఓ ప్రైవేటు స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. చదువుపై ఆసక్తి లేదు. స్కూల్‌కు సరిగా వెళ్లేవాడు కాదు. ఈ క్రమంలో హ్యాండ్‌రైటింగ్ కోర్సుకని అబ్బాయి తల్లి పంపేది. ఈనెల 6వ తేదీ ఆ ఫీజుకని రూ.1000 ఇచ్చి పంపింది. ఆ డబ్బుతో ఇంటి నుంచి బయటకు వచ్చిన గౌతమ్ అదృశ్యమయ్యాడు. బంధువుల ఇళ్లలో ఆరా తీసినా ఆచూకీ దొరకలేదు. దీంతో కుటుంబసభ్యులు.. త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.



భారత జట్టు ఐసీసీ చాంపియన్ ట్రోఫీ ఫైనల్లో విజయం సాధించడంతో ముదిగుబ్బలో అభిమానుల సంబరాలు

పేరుకుపోయిన బకాయిలు

నత్తనడకన పన్ను వసూళ్లు

30 శాతం కూడా దాటని వైనం

ఆ పది మంది బకాయిలు రూ.కోటిపైనే..

పుట్టపర్తి, మార్చి 9(ఆంధ్రజ్యోతి): ఒక ప్రాంతం అభివృద్ధి చెందాలంటే ఆదాయ వనరులతో పాటు పన్ను చెల్లింపులు సకాలంలో ఉండాలి. అయితే జిల్లా కేంద్రంలో బాగా ఆదాయం వచ్చే వనరులు పరిశ్రమలు లేవు. పన్నులు వసూళ్ల మాత్రం వెనుకపడ్డారు. దీంతో మున్సిపాలిటీలో నిధుల కొరత ఉంది. మున్సిపాలిటీలో 14,141 గృహాలు ఉన్నాయి. ఇందులో ఎక్కువ మందికి రూ.500 నుంచి రూ. 1000 లోపలే పన్నులు ఉంటాయి. సామాన్యులు సకాలంలో పన్ను చెల్లించినా.. ధనవంతులు, బడాబాబులు మాత్రం పన్నులు చెల్లించలేదు. పన్నుల వసూళ్లకు మూడు వారాలు మాత్రమే గడువు మిగిలి ఉంది. ఆర్థిక సంవత్సరంలో పన్నులు వసూళ్ల అయితే.. అభివృద్ధి పనులకు ఆ నిధులు వినియోగించుకునేందుకు అవకాశం ఉంటుంది. అయితే పన్నుల వసూళ్లలో మాత్రం ఏటా జాప్యం జరుగుతూనే ఉంది. మొండి బకాయిలు పెరిగిపోతున్నాయి.

● వసూళ్లపై నిర్లక్ష్యం..

ఆస్తి పన్ను రూ.7.25 కోట్లు రావాల్సి ఉండగా రూ.2.14 కోట్లు మాత్రమే వసూళ్లు అయింది. దీంతో 30 శాతం కూడా దాటలేదు. పాతపన్నులు రూ.3.60కోట్లు ఉండగా రూ.48 లక్షలు మాత్రమే వసూలైంది. కొత్తపన్నులు రూ.3.65 కోట్లు ఉండగా రూ.1.66 కోట్లు వసూలైంది. నీటి పన్ను రూ.85 లక్షలు ఉండగా ఇందులో రూ.20 లక్షలు మాత్రమే వచ్చింది. మొత్తం మీద మున్సిపాలిటీలో 30 శాతం కూడా రాలేదు.



పుట్టపర్తి మున్సిపల్ కార్యాలయం

● ఆ పది బకాయిలు రూ.కోటికిపైనే...

మున్సిపాలిటీలో అత్యధికంగా రూ. 24 లక్షలు ఒకే వ్యక్తి చెల్లించాల్సి ఉంది. మిగిలిన తొమ్మిది మంది బకాయిలు రూ.కోటిపైగా ఉన్నాయి. రూ.లక్షపైన పన్ను కట్టాల్సిన వ్యక్తులు 50 మంది దాకా ఉన్నారు. ఎక్కువ మొత్తంలో ఉన్న పన్నులు చెల్లించకపోవడంతో బకాయిలు పేరుకుపోయాయి.

వసూళ్లకు ప్రత్యేక బృందాలు

మున్సిపాలిటీలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి పన్నులు వసూళ్లు చేస్తున్నాం. మున్సిపల్ సిబ్బంది, వార్డు సచివాలయ సిబ్బంది ఇంటింటికి వెళ్లి పన్నులు వసూళ్లు చేస్తున్నారు. సకాలంలో పన్నులు చెల్లించి అందరు అభివృద్ధికి సహకరించాలి.

-ప్రహల్లాద, కమిషనర్, పుట్టపర్తి

వదాన్య టీంని ఆదర్శంగా తీసుకోవాలి

సినీ దర్శకుడు బీవీఎస్ రవి

ఘనంగా వదాన్య జన సొసైటీ బహుమతుల ప్రదానోత్సవం



విద్యార్థులకు చెక్కును అందజేస్తున్న అతిథులు, వదాన్య జన సొసైటీ సభ్యులు

అనంతపురం ప్రెస్‌క్లబ్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): నేటి యువత వదాన్య జన సొసైటీ సభ్యులను ఆదర్శంగా తీసుకోవాలని సినీ దర్శకుడు బీవీఎస్ రవి అన్నారు. వదాన్య జన సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎస్జీటీ మెగా గ్రాండ్ టెస్ట్, టాలెంట్ టెస్ట్‌లలో ప్రతిభ చూపిన పలువురు విద్యార్థులకు బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్డీటీ ఇంక్లూజివ్ సెంటర్‌లో ఆదివారం వదాన్య జనసొసైటీ వ్యవస్థాపకులు అశోక్ పడపాటి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి బీవీఎస్ రవి, ఆర్డీటీ మాంచో ఫెర్రర్‌లు ముఖ్య అతిథు లుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ 2024లో శ్రీ సత్యసా యి జిల్లాలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో వదాన్య సొసైటీ టాలెంట్ టెస్ట్ నిర్వహించి, ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేయడం అభినందనీయమన్నారు. అనంతరం ప్రతిభ కనబరిచిన వి.మంజుల, విశ్వనాథ్, వి. చెన్నారెడ్డి, నరసింహ, లోకేశ్, ఓబులేసులకు రూ. 4 లక్షలు విలువ చేసే బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆర్డీటీ ఎకాలజీ సెం టర్ మల్లారెడ్డి, న్యాయవాది పుట్టపర్తి ప్రభాకర్‌రెడ్డి, రవికాంత్ రమణ, లెనిన్ బాబు పాల్గొన్నారు.

● గణేశ్ మున్సిపల్ ఉన్నత పాఠశాల ప్రతిభ

ధర్మవరం : వదాన్య జన సైసొటీ ఆధ్వర్యంలో గత ఏడాది డిసెంబరులో నిర్వహించిన గణితం టాలెంట్ టెస్టులో తమ విద్యార్థులు ప్రతిభ చాటి బహుమతులు పొందారని గణేశ్ మున్సిపల్ ఉన్నత పాఠశాల హెచ్ఎం లక్ష్మీనారాయణరెడ్డి ఆదివారం తెలిపారు. ఈ టాలెంట్ టస్టులో జిల్లా మొదటి స్థానంలో పాటు టాప్ 10లోపు ఐదు స్థానాలను కైవసం చేసుకున్నాయని ఆయన తెలిపారు. ఇందులో ఎం.నరసింహులు మొదటి ర్యాంకు (రూ.25వేలు), ఎస్.కరీముల్లాఆరో ర్యాంక్(రూ.7500), కె.గౌతంకృష్ణ ఏడో ర్యాంకు (రూ.7500), కె.విష్ణువర్దన్ తొమ్మిదవ ర్యాంక్(రూ.5వేలు), జి.రెడ్డిచరణ్ దేవా పదో ర్యాంక్ (రూ.5వేలు) సాధించారన్నారు. వీరికి నగదు బహుమతి, షీల్డ్‌లను వదాన్య జనసొసైటీ ప్రతినిధులు అనంతపురంలోని ఆర్డీటీ పాఠశాలలో అందజేశారన్నారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు

ఓబుళదేవరచెరువు, మార్చి 9(ఆంధ్రజ్యోతి): విద్యుత్ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్లను తక్కువ ఎత్తులో.. ఎలాంటి రక్షణ కంచె లేకుండా ఏర్పాటు చేశారు. స్థానిక స్టేట్ బ్యాంక్ వద్ద ట్రాన్స్‌ఫార్మర్ వల్ల ఎప్పుడు.. ఏ ప్రమాదం జరుగుతుందో అని ఆ ప్రాంత వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఓడీసీ గ్రామ సచివాలయ ఎదురుగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు రక్షణ కంచె ఏర్పాటు చేయలేదు. ప్రధానంగా ప్రతి బుధవారం వారంపు సంతను రోడ్డుకు ఇరువైపులా నిర్వహిస్తారు. దీంతో ఎప్పుడు ప్రమాదం జరుగుతుందో అని ప్రజలు భయపడుతున్నారు.



స్టేట్ బ్యాంక్ వద్ద తక్కువ ఎత్తులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్, ఓడీసీ సచివాలయం ఎదురుగా రక్షణలేని ట్రాన్స్‌ఫార్మర్



ఎయిర్‌పోర్టులో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ

మంత్రి లోకేశ్ పర్యటనకు బందోబస్తు

పుట్టపర్తి రూరల్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మానవ వనరులు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ పర్యటన నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని సత్యసాయి ఎయిర్‌పోర్టులో బందోబస్తు ఏర్పాట్లను ఎస్పీ వీ రత్న ఆదివారం పరిశీలించారు. మంత్రి నారా లోకేశ్ సోమవారం సాయంత్రం లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో పాల్గొంటారు. ఇందులో భాగంగా ఆయన సాయంత్రం ఐదు గంటలకు ప్రత్యేక విమానంలో సత్యసాయి ఎయిర్ పోర్టుకు చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన కదిరికి చేరుకుంటారు. మంత్రి పర్యటనకు తీసుకోవాల్సిన భద్రత ఏర్పాట్లపై పోలీసు అధికారులతో ఎస్పీ సమీక్ష నిర్వహించారు. ఇందులో డీఎస్పీలు విజయ్‌కుమార్, శ్రీనివాసులు, ఆదినారాయణ, ఎస్బీసీఐ బాలసుబ్రహ్మణ్యంరెడ్డి, సీఐలు సునీత, సురేష్, ఆర్‌ఐలు వలి, మహేష్ పాల్గొన్నారు.

వైసీపీ నుంచి బీజేపీలోకి చేరిక

ధర్మవరం : స్థానిక 33వ వార్డుకు చెందిన వైసీపీ నాయకులు కుంచపు రవి, గుండగుల నరేశ్, వారి అనుచరులతో సహా ఆదివారం బీజేపీలో చేరారు. వీరికి బీజేపీ నియో జకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ, రూరల్ అధ్యక్షుడు జింకాచంద్ర, గొట్లూరు చంద్ర, ముదిగుబ్బ ఎంపీపీ ఆదినారాయణ యాదవ్ పాల్గొన్నారు.



బీజేపీలోకి చేరుతున్న వైసీపీ నాయకులు

కుక్కల దాడిలో ఐదుగురికి గాయాలు

ధర్మవరం, మార్చి 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం కుక్కల దాడిలో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. దారి వెంట వెళ్తున్న వారిపై కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. లోనికోటకు చెందిన ఇమామ్‌హుస్సేన్, శారదానగర్‌కు చెందిన రెడ్డమ్మ, గాంధీనగర్‌కు చెందిన ప్రభాస్, గొట్లూరుకు చెందిన జీవన్‌కుమార్ అనే బాలుడితోపాటు మరొకరిపై కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. గాయపడిన వారికి స్థానిక ప్రభుత్వాసుపత్రిలో వైద్య చికిత్సలు అందించారు. కుక్కలను నియంత్రించడానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పగలే వెలుగులు

మూడు నెలలుగా... విద్యుత్ వృథా

పట్టించుకోని పంచాయతీ అధికారులు

కొత్తచెరువు, మార్చి 9(ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వేస్టేషన్ వెళ్లే రహదారిలో వీధిలైట్లు మూడు నెలల నుంచి పగలు, రాత్రి అని తేడా లేకుండా ఇలా నిత్యం వెలుగుతూనే ఉన్నాయి. పంచాయతీ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వల్ల ఇలా విద్యుత్ వృథా అవుతోంది. ఇవే కాదు.. పలు వీధుల్లో విద్యుత్ దీపాలు నిత్యం ఇలా వెలుగుతూనే ఉన్నాయి. దీంతో విద్యుత్ బిల్లుల రూపంలో పంచాయతీపై భారీ పడుతోంది. పంచాయతీకి వచ్చిన ఆదాయం అధికారుల నిర్లక్ష్యం వల్ల విద్యుత్ బిల్లుల రూపంలో వృథా అవుతోంది. పంచాయతీ అభివృద్ధి కుంటుపడుతోంది. కనీసం ఆ వీధిలైట్లకు స్విచ్‌లైనా ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



రైల్వేస్టేషన్ రోడ్డులో పగలే వెలుగుతున్న వీధిలైటు

న్యూస్ బాక్స్

జైజవాన్.. జైకిసాన్‌పై అవగాహన

ఓబుళదేవరచెరువు, మార్చి 9(ఆంధ్రజ్యోతి): స్థానిక షాదీమహాల్‌లో ఆదివారం జై జవాన్, జైకిసాన్ పై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని రాష్ట్ర ఆర్గానిక్ కన్వీనర్ శరత్‌కుమార్‌రెడ్డి నిర్వహించారు. వెంకటేశ్వరా కో-ఆపరేటీవ్ పవర్ అండ్ ఆరోగ్య ప్రాసెసింగ్ లిమిటెడ్ ఆధ్వర్యంలో రైతులకు అందించే సబ్సిడీ, పంటల సాగుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు బసవరాజ్, చరణప్ప, అడ్వజర్లు బాబాజీ, జయరామిరెడ్డి, మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

దాడికి యత్నించిన వారిని శిక్షించాలి

కదిరిఅర్బన్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): పుట్టపర్తి మండలంలోని పెడబల్లి పంచాయతీ కార్యదర్శి గోపాల్‌రెడ్డిపై దాడికి ప్రయత్నించిన వారిని కఠినంగా శిక్షించాలని ఆంధ్రప్రదేశ్ పంచాయతీ కార్యదర్శుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామమోహన్ ఆదివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఆస్తి మదిపు సర్టిఫికెటు ఇవ్వాలని కొంతమంది పంచాయతీ కార్యదర్శిపై ఒత్తిడి తెచ్చారన్నారు. తమ పరిధికి మించి ఇవ్వలేని కార్యదర్శి చెప్పగా, అతన్ని దుర్భాషలాడి, దాడికి ప్రయత్నించి రంగప్ప, తిప్పన్నను అరెస్టు చేసి, కఠినంగా శిక్షించాలని కోరారు.

రైతులను ఆదుకోవాలి

తనకల్లు, మార్చి 9(ఆంధ్రజ్యోతి): రైతు భరోసా వెంటనే అమలు చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక చౌడేశ్వరీ ఆలయంలో వారు మాటాడుతూ.. వందశాతం సబ్సిడీతో రైతులకు డ్రిప్ స్ప్రింకర్లు ఇవ్వాలని, పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, మోటార్లకు మీటర్లు పెట్టరాదని డిమాండ్ చేశారు. హంద్రీనీవా కాలువను వెడల్పు చేయాలన్నారు. కాలువ నీటిని మండలంలోని అన్ని చెరువులకు నింపేలా చర్యల తీసుకోవాలని అన్నారు. సోమవారం కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో శివన్న, ఒంటెద్ద వేమన్న, క్రిష్టప్ప, అక్కులప్ప నాయకులు పాల్గొన్నారు.

టైలరింగ్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

తనకల్లు, మార్చి9(ఆంధ్రజ్యోతి): మండలంలోని బీసీ, ఈబీసీ, కమ్మ, రెడ్డి, క్షత్రియ, వైశ్యా, బ్రాహ్మణ, కాపు కులాలకు చెందిన మహిళలు ఉచిత టైలరింగ్ శిక్షణ కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ పూల రెడ్డెప్ప ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణకు ఓబీఎంఎంఎస్ పోర్టల్ నందు దరఖాస్తు చేసుకోవాలన్నారు. సచివాలయంలో ఉన్న వెల్ఫేర్ అసిస్టెంట్ లాగిన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఈనెల 12వరకు దరఖాస్తులు చేసుకోవచ్చని, సందేహాలుంటే ఎంపీడీఓ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

హరీశ్.. నోరు అదుపులో పెట్టుకో..: సీపీఐ

ధర్మవరం, మార్చి 9(ఆంధ్రజ్యోతి): బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్ నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలనీ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణను విమర్శించేస్థాయి అతనికి లేదనే విషయాన్ని గుర్తించుకోవాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ముసుగు మధు హెచ్చరించారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వంలో అనేక అవినీతి ఆరోపణలు ఉన్న వారిని పక్కన పెట్టుకుని.. ధర్మవరంలో భయభ్రాంతులకు గురిచేసి వ్యాపారులతో నుంచి ఎంత డబ్బులు వసూలు చేశారో అందరికి తెలుసన్నారు. తాడిమర్రి మండలంలో అదాని హైడల్ పవర్ ప్రాజెక్టు పనుల వద్దకు వెళ్లి అడ్డుకోవడం నిజం కాదా అని ప్రశ్నించారు. సమావేశంలో సీపీఐ నాయకులు జింకా చలపతి, రవికుమార్, రమణ, వెంకటనారాయణ, ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు సకలరాజ, శ్రీనివాసులు, రంగయ్య పాల్గొన్నారు.

నాటుసారాపై ప్రజలకు అవగాహన

నల్లమాడ, మార్చి9(ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డికుంట తండా, నేరాలవంకతండాల్లో పుట్టపర్తి ఎక్సైజ్ సీఐ నాగరాజు, ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ గోవిందునాయ్ ఆదివారం నాటుసారా నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించారు. నాటుసారా తయారు చేయడం.. సేవించడం నేరమన్నారు. సేవించడం వలన వచ్చే వ్యాధుల గురించి వివరించారు. నాటుసారా తయారీ, రవాణా, అమ్మకం చేసేవారికి విధించే శిక్షణను వివరించారు. అలాగే సంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ ఉమామనోహర్‌రాజు, పుట్టపర్తి అటవీ శాఖాధికారులు పాల్గొన్నారు.

కంది దిగుబడి లేనట్టే..



నూర్పిడి కోసం ఆరబెట్టిన కంది పంట

నంబులపూలకుంట, మార్చి 9(ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తం గా ఖరీఫ్‌లో సాగుచేసిన కంది ఆశించిన స్థాయిలో దిగుబడి లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దాదాపు రెండువేల ఎకరాలకు పైగా కంది పంటను సాగుచేశారు. ఎకరాకు ఒక క్వింటా కూడా దిగుబడి వచ్చే అవకాశంలేదంటున్నారు. వాతావరణ పరిస్థితుల వలన పూత పూర్తిగా రాయిపోయిందన్నారు. ఎకరా కంది పంట సాగుచేయడానికి రూ.15వేలు ఖర్చు అయిందని, కంది కట్టెను ప్రస్తుతం కోయాలన్నా.. కూలీల ధరలు అధికంగా ఉన్నాయని, కనీసం కూలీల డబ్బు అయినా చేతికి వచ్చేలా లేదని రైతులు వాపోతున్నారు.

ఘనంగా సరస్వతి పూజ



సరస్వతి పూజ నిర్వహిస్తున్న దృశ్యం

కదిరిఅర్బన్: పట్టణంలోని బ్లూమూన్ పాఠశాలలో ఆదివారం ఘనంగా సరస్వతి పూజ నిర్వహించారు. వివిధ పుష్పాలతో సరస్వతి అమ్మవారి చిత్రపటాన్ని ఆలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. పది పరీక్షల్లో మంచి ఫలితాలు రావాలని ప్రార్థిం చారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ శివశంకర్, హెచ్ఎం మాధవరెడ్డి, పాఠశాల ఇన్‌చార్జీ సురేంద్ర, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతాం

ధర్మవరం డీఎస్పీ హేమంత్‌కుమార్

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ



ధర్మవరం, మార్చి 9(ఆంధ్రజ్యోతి): ధర్మవరం డివిజన్ పరిధిలో ఎక్కడా అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని ధర్మవరం డీఎస్పీ హేమంత్‌కుమార్ అన్నారు. ఎక్కడైనా అలాంటి కార్యక్ర మాలకు ప్రోత్సహించిన ఉక్కుపాదంతో అణచి వేస్తామని పేర్కొన్నారు. ఆయనతో నిర్వహించిన ప్రత్యేక ఇంటర్వ్యూ ఇలా సాగింది..

ప్రశ్న: పట్టణంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. నివారణకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు..?

జవాబు: పట్టణంలోకి పగలే భారీ వాహనాలు వస్తున్నాయి. ఆ సమయంలో అనేక మంది రోడ్లపై సంచరిస్తూ ఉంటారు. దీంతో సాయంత్రం ఆరు గంటల నుంచి ఉదయం ఆరు గంటల వరకే భారీ వాహనాలను పట్టణంలోకి అనుమతులు ఇస్తాం. ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నాం.

ప్రశ్న : శాంతిభద్రతల పరిరక్షణకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు?

జవాబు: ఎక్కడ జనాలు గుమిగూడకుండా చేయడం. ఎస్పీ ఆదేశాల మేరకు ప్రత్యేకంగా ఎస్‌హెచ్‌ఓలను ఏర్పాటుచేసి లా ఆర్డర్‌పై గట్టి చర్యలు చేపడుతున్నాం. గ్రామాల్లో పల్లెనిద్ర కార్యక్రమాలు చేపట్టి ప్రజలతో నేరుగా మంచి సంబంధాలు మెరుగుపరుచుకోవడం జరుగుతోంది. ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే చర్యలు చేపడుతున్నాం. డివిజన్ పరిధిలో లా ఆర్డర్ రక్షణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం.

ప్రశ్న : చోరీలకు ఎలా అడ్డుకట్ట వేస్తారు?

జవాబు: నేను బాధ్యతలు చేపట్టిన తరువాత రామగిరి మండలం ననకోట ముత్యాలమ్మ ఆలయంలో చోరీ జరిగింది. ప్రత్యేక టీంలతో పాటు టెక్నాలజీ ద్వారా ఆ చోరీ కేసు ను చేధించి చోరీ చేసిన దొంగలను అరెస్టు చేశాం. రాత్రి సమయాల్లో కూడా ప్రత్యేకంగా నిఘాను ఏర్పాటు చేశాం. చోరీలు జరగకుండా కూడా చర్యలు తీసుకుంటున్నాం.

ప్రశ్న : గంజాయి, పేకాట అడ్డుకట్టకు చర్యలు చేపట్టారా..?

జవాబు : గంజాయి తాగడం వల్ల జరిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించడానికి పలు కార్యక్రమాలు చేపడుతున్నాం.. అదేవిధంగా వీటిపై త్వరలో పెద్ద కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి గంజాయి వాడటం వల్ల కలిగే నష్టాల గురించి నిపుణుల ద్వారా అవగాహన కల్పిస్తాం. ఇక పేకాట పై కూడా ఇప్పటికే ఉక్కుపాదం మోపుతున్నాం. ఇందులో ఎంతవారైనా కలుగజేసుకున్న వదిలే ప్రసక్తే లేదు.

క్రైం న్యూస్..

గుర్తుతెలియని వ్యక్తి మృతి

కొత్తచెరువు, మార్చి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగిరెడ్డిపల్లి రైల్వే బ్రిడ్జి కింద రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మరణించిన సంఘటన శనివారం రాత్రి 2-30 గంటల సమయంలో చోటు చేసుకుంది. గూడ్స్ రైలు ఢీకొనడంతో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం గుర్తు పట్టలేని విధంగా తయారైంది. హిందూపురం రైల్వే పోలీసులు మృతదేహాన్ని ఆదివారం ఉదయం పెనుకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతునికి 40 సంవత్సరాలు ఉంటాయని, అతని ఆచూకీ లభించలేదని, వివరాలు తెలిసిన వారు 94412 38182కు సమాచారం ఇవ్వాలని హిందూపురం రైల్వే హెడ్‌కానిస్టేబుల్ ఎర్రిస్వామి కోరారు.

మహిళ అదృశ్యం



సుకన్య

ధర్మవరం, మార్చి 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాంనగర్‌కు చెందిన సుకన్య అదృశ్యమైనట్లు ఆమె భర్త క్రిష్టారెడ్డి టూటౌన్ పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు. శనివారం ఉదయం ఇంటి నుంచి వెళ్లిన సుకన్య రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో బంధువులు, తెలిసిన వారి ఇళ్లలో గాలించామని, అయినా ప్రయోజనం లేకపోవడంతో ఆదివారం ఉదయం క్రిష్టారెడ్డి తమకు ఫిర్యాదు చేశారని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకొని.. దర్యాప్తు చేపట్టామన్నారు.

పెద్దమ్మ తల్లికి మరుపూజ



అలంకరణలో పెద్దమ్మతల్లి

ముదిగుబ్బ, మార్చి 9(ఆంధ్ర జ్యోతి): స్థానిక పాత ఊరులో వెలసిన గ్రామదేవత పెద్దమ్మతల్లికి ఆదివారం రోజు మరు పూజ కార్యక్రమం నిర్వహించారు. శివరాత్రి మూడు రోజుల జాతర తరువాత వచ్చే ఆదివారం రోజున ఇలా మారు పూజ చేయడం ఆనవాయితీగా వస్తున్న ఆచారమని పూజారులు బ్యాంక్ పెద్దన్న, శివసాయి తెలిపారు. తెల్లవారుజామున అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు జ్యోతులు, బోనాలు సమర్పించారు. మహిళలు అమ్మవారికి ఒడి బియ్యం, చీరలు, గాజులు సమర్పించారు.


శ్రీవారి బ్రహ్మోత్సవాలకు
స్వాగతం..
సుస్వాగతం...
కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా భక్తుల పాలిట
కొంగుబంగారంగా నిలిచి కదిరి నందు వెలసిన
శ్రీమత్ ఖాద్రీ లక్ష్మినరసింహస్వామి
బ్రహ్మోత్సవాలలో భాగంగా నేడు అత్యంత
వైభవంగా, కన్నుల పండువగా జరుగు
శ్రీవారి కళ్యాణోత్సవానికి విచ్చేయుచున్న
యువనాయకులు,
రాష్ట్ర విద్య, ఐటి శాఖామాత్యులు
శ్రీ నారా లోకేష్ గారికి
మా హృదయపూర్వక
స్వాగత సుమాంజలులు
ఎం.ప్రతాప్ రెడ్డి
శివసాయి ఆగ్రో సీడ్స్,
తిరుమల ట్రేడర్స్ ఇండస్ట్రియల్ ఎస్టేట్,
కదిరి, శ్రీసత్యసాయి జిల్లా
సెల్: 9502096292
ఎద్దుల క్రిష్ణమూర్తి
తెలుగుదేశం పార్టీ
జిల్లా ఉపాధ్యక్షులు,
కదిరి,
శ్రీసత్యసాయి జిల్లా
నియోజకవర్గ ప్రజలు,
కదిరి, శ్రీసత్యసాయి జిల్లా

న్యూస్ బాక్స్

లేపాక్షి ఆలయ తూర్పు ద్వారానికి గ్రహణం



మూతబడిన ఆలయ తూర్పుద్వారం

లేపాక్షి, మార్చి 9(ఆంధ్రజ్యోతి): ప్రపంచప్రసిద్ధిగాంచిన లేపాక్షి, దుర్గావీరభద్రస్వామి ఆలయ తూర్పుద్వారం మరలా మూతబడింది. ఈ ఆలయానికి దేశం నలుమూలల నుంచి భక్తులు, పర్యాటకులు విచ్చేస్తుంటారు. వీరినిదృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం లక్షలు వెచ్చించి తూర్పుద్వారంలో వీల్‌చైర్లతో ఆలయంలోకి ప్రవేశించేందుకు ర్యాంప్‌ను ఏర్పాటు చేసింది. ఇది ఏర్పాటుచేసి దాదాపు మూడేళ్లు పూర్తయినా ఇప్పటి వరకు మనుగడలోకి రాలేదు. పత్రికల్లో ఆలయ తూర్పుద్వారంపై కథనాలు ప్రచురితమైనప్పుడు మాత్రం అత్యుత్సాహంగా రెండు మూడు రోజులు తెరిచి మళ్లీ మూసేస్తున్నారు. ర్యాంప్ సరిగాలేదని మరమ్మతులకు గురైందని కుంటిసాకులు చెబుతున్నారు. ఇప్పటికైనా ఆలయానికి విచ్చేసే వికలాంగులు, వృద్ధులకు తూర్పుద్వారాన్ని తిరిగి తెరవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

తారురోడ్డు పనుల పరిశీలన

గోరంట్ల, మార్చి9(ఆంధ్రజ్యోతి) : మండలంలోని హిందూపురం, కదిరి ప్రధాన రహదారిలో తారురోడ్డు మరమ్మతుల పనులను కూటమి నాయకులు ఆదివారం పరిశీలించారు. వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో రాష్ట్రవ్యాప్తంగా రోడ్లు గుంతలమయమై పాడైన విషయం తెలిసిందే. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రోడ్డు మరమ్మతులు చేపట్టిందని కన్వీనర్ సోముశేఖర్ తెలిపారు. రాష్ట్ర బిసి సంక్షేమచేనేత జౌళి శాఖమంత్రి సవిత సహకారంతో రూ.4.96 కోట్లతో రోడ్డు మరమ్మతులు చేపట్టారన్నారు. కదిరి రోడ్డునుంచి ప్రభుత్వ ఆసుపత్రి వరకు నూతనంగా వేసిన తారురోడ్డుపై వారు ఆదివారం ప్రదర్శనగా వెళ్లారు. ఈకార్యక్రమంలో కూటమి నాయకులుసోముశేఖర్, బోయ లక్ష్మీనారాయణ, బాలక్రిష్ణ; వెంకటరెడ్డి, పచ్చ అశోక్, అజంతుల్లా, గిరిధర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

బదిలీ ఎస్‌ఐలకు ఘనంగా వీడ్కోలు



ఎస్‌ఐలకు సన్మానం చేస్తున్న పోలీసు సిబ్బంది

గోరంట్ల, మార్చి9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్ నుంచి బదిలీపై వెళ్తున్న ఎస్‌ఐలు శ్రీనివాసులు, బాలాజీనాయక్‌లకు ఆదివారం పోలీసులు ఘనంగా వీడ్కోలు పలికారు. సీఐ శేఖర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పూలమాలలు, దుశ్శాలువలతో ఇరువురిని సత్కరించారు. బాలాజీనాయక్ గోరంట్ల ఎస్‌ఐగా ఫిబ్రవరినెలలో బాధ్యతలు స్వీకరించారు. కొత్తగా రిక్రూట్ అయిన యువ ఎస్‌ఐలకు స్థానం కల్పించడానికిగాను ప్రభుత్వం ర్యాంకర్ ఎస్‌ఐలను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. శ్రీనివాసులు నంద్యాలకు, బాలాజీనాయక్ అన్నమయ్యజిల్లాకు ఎస్‌ఐలుగా బదిలీ అయ్యారు. కార్యక్రమంలో పలువురు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అపూర్వ కలయిక



అధ్యాపకులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

పెనుకొండ, మార్చి 9(ఆంధ్రజ్యోతి):పెనుకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2010-12 సంవత్సరంలో సీఈసీ చదివిన పూర్వవిద్యార్థులు ఒక చోట కలిసి మనసు విప్పి మాట్లాడుకున్నారు. ఆదివారం తాము చదివిన కళాశాలలో పూర్వ విద్యార్థులు మధుకర్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి, షాషావలి, రాజేష్, రాము, హరిత, మానస, సాయిలీల, శ్వేత, శంకరమ్మ తదితరులు అందరూ ఒకేచోట కలిసి గత స్మృతులను నెమరవేసుకున్నారు. అనంతరం తమకు చదువు చెప్పిన వైస్ ప్రిన్సిపాల్ ఎస్ఎన్ మూర్తి, రాజశేఖర్‌రెడ్డి, శివన్న, మురళి, గంగప్ప, అన్వరభాషలను పూలమాలలువేసి శాలువకప్పి ఘనంగా సత్కరించారు.

సీసీ గిరిలో ఘనంగా సిద్ధభుక్తి

గుడిబండ, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సి.సి. గిరి గ్రామంలో గ్రామస్తుల ఆధ్వర్యంలో సిద్దభుక్తి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆదివారం గ్రామస్తులు హెంజేరు సిద్దేశ్వరస్వామికి ప్రత్యేక పూలతో అలంకరించి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనేక మంది భక్తులు పాల్గొని హెంజేరు సిద్దేశ్వరస్వామిని దర్శించుకొన్నారు. హాజరైన భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ



భూమిపూజలో పాల్గొన్న హిరేతుర్పి గ్రామస్థులు

గుడిబండ, మార్చి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని హిరేతుర్పి గ్రామంలో ఎస్సీ కాలనీ ప్రజలు, గ్రామస్తుల ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహ ప్రతిష్ఠాపనకు ఆదివారం భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామస్తులు కలిసి మెలిసి అంబేడ్కర్ విగ్రహ ప్రతిష్ఠాపన చేయడానికి సిద్ధమయ్యారు. అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి కొబ్బరికాయలు కొట్టి పూజలు చేపట్టారు. అనంతరం భూమి పూజ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో గ్రామస్తులు ఎస్సీ కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

అవినీతి షికారు అక్రమాలు మోర్



● రెండు శాఖల్లో పోటాపోటీగా వసూళ్లు

● కూటమి నాయకుల సహకారం?

హిందూపురం, మార్చి 9(ఆంధ్రజ్యోతి): కాసుల కోసం కొందరు అధికారులు అడ్డదారులు తొక్కుతున్నారు. కొన్నిశాఖలకు సంబంధించిన అధికారులు స్థాయిని మరిచి డబ్బులు డిమాండ్ చేస్తుండటంతో బాధితులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది బాధితులు ఎమ్మెల్యే కార్యాలయానికి చేరుకుని ఫిర్యాదు చేస్తున్నారు. వాటిపై పైస్థాయి అధికారులతో విచారణ చేయించి చర్యలకు ఉపక్రమిస్తున్నారు. అక్రమా ర్కుల వ్యవహారాలను ఎమ్మెల్యే కూడా సీరియస్‌గా పరిగణిస్తున్నట్లు సమాచారం. ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని భావించిన కొందరు ముఖ్య నేతలు సంబంధిత అధికారులను నియోజకవర్గం దాటించేందుకు సిద్ధపడుతున్నారు.

సహకరిస్తున్న కూటమి నాయకులు

వైసీపీ హయాంలో అడ్డగోలుగా వ్యవహరించిన అధికారులకు కొంత మంది కూటమి నాయకులు వత్తాసు పలుకుతున్నట్లు సమాచారం. వైసీపీకి విధేయులుగా పనిచేసిన అధికారులను కొందరు మండల స్థాయి నాయకులు వెనకేసుకొస్తున్నారు. దీనివల్ల కొన్నిశాఖలకు సంబంధించి కూటమి నాయకులకంటే వైసీపీ నాయకులకే పనులు ఎక్కువగా జరుగుతున్నాయనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. వైసీపీ హయాంలో హిందూపురంలో కొన్నిశాఖల ముఖ్య అధికారులు అడ్డగోలుగా వ్యవహరించారు. వారు చెప్పిన విధంగా పనులు చేసిపెట్టారు. వైసీపీ హయాంలో హిందూపురం రెవెన్యూ కార్యాలయంలో వారికి వీరవిధేయులుగా ఉన్న ఓ అధికారిని ఇప్పటికీ కొనసాగిస్తుండటం పట్ల టీడీపీ నాయకులు గుర్రుగా ఉన్నారు. ఆ అధికారికి ఎవరు అండదండలు ఉన్నాయో తెలియని పరిస్థితి. ఆ అధికారి ఇప్పటికీ వైసీపీ నాయకుల కనుసన్నల్లోనే వ్యవహరిస్తున్నారన్నవిమర్శలున్నాయి. ఎందుకంటే ఆయన టీడీపీ నాయకులు చెప్పిన పని ఏదికూడా చేయడంలేదన్న వాదనలు ఉన్నాయి. మరికొన్ని కార్యాలయాల్లో కూడా పరిస్థితి ఇలాగే ఉందని కొందరు కూటమి నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

హిందూపురం నియోజకవర్గంలో రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల అధికారులు పోటీపడి వసూళ్లు చేస్తున్నట్లు సమాచారం. ఇటీవల చిలమత్తూరు మండలంలో ఓ పంచాయతీ అధికారి నిధులు పక్కదారి పట్టించిన విషయం విదితమే. దీంతో ఆ అధికారిని సంబంధితశాఖ అధికారులు విధులకు దూరంగా పెట్టారు. లేపాక్షి మండలంలో ఓ పంచాయతీ అధికారి లేఅవుట్ విషయంలో కాసుల కోసం కక్కుర్తి పడినట్లు సంబంధిత భూ యజమానులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయం ఎమ్మెల్యే కార్యాలయానికి చేరింది. దీంతో ఆ పంచాయతీ అధికారిని పిలిపించి మందలించినట్లు తెలిసింది.

హిందూపురం మండలంలో కూడా ఒకరిద్దరు పంచాయతీ అధికారులు అడ్డగోలుగా వ్యవహరిస్తున్నట్లు సమాచారం. ముఖ్యంగా ఓ పంచాయతీ అధికారి భారీ మొత్తం డిమాండ్ చేయడంతో ఈ విషయంపై సంబంధిత పరిశ్రమ యజమానులు హైకోర్టును ఆశ్రయించేందుకు సిద్ధమయ్యారు. ఈ విషయం తెలుసుకున్న పై అధికారులు మందలించడంతో ఆ పంచాయతీ అధికారి వెనక్కు తగ్గినట్లు తెలిసింది. రెవెన్యూశాఖలో చిలమత్తూరు మండలంలో భూరికార్డులను తారుమారుచేసి హక్కుదారులకు కాకుండా వేరేవారికి భూములు బదిలీ చేయడంపై అప్పట్లో ఇన్‌చార్జి తహసీల్దార్‌గా ఉన్న ఓ అధికారిని సస్పెండ్ చేశారు. లేపాక్షి మండలంలో కూడా కార్యాలయంలో పనిచేసే ఓ అధికారి అడ్డగోలుగా వ్యవహరిస్తూ లక్షలు వెనకేసుకొస్తున్నట్లు ఇటీవల సోషల్‌మీడియాలో వైరల్ అయింది. హిందూపురం రెవెన్యూ కార్యాలయంలో పనిచేస్తున్న ఓ అధికారి కొద్దిరోజుల కిందట కదిరి గ్రామానికి చెందిన వ్యక్తి ద్వారా హిందూపురంలో భూమికి సంబంధించి భారీ మొత్తంలో వసూలు చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఇదెక్కడి శ్రమ దోపిడీ..?

● శ్రామిక మహిళా దినోత్సవంలో స్కూల్ వర్కర్ల ధ్వజం

హిందూపురం అర్బన్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): ఇచ్చే జీతం తక్కువ అనీ, చేయించుకునే పని మాత్రం ఎక్కువ అనీ, ఇది శ్రమ దోపిడీ కాదా అని ఆంధ్రప్రదేశ్ యునైటెడ్ స్కూల్ వర్కర్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, కన్వీనర్ ప్రమీల ప్రశ్నించారు. పట్టణ పరిధిలోని ఎంజీఎం పాఠశాలలో ఆదివారం ఏఐయూటీయూసీ ఆధ్వర్యంలో ఆ యూనియన్ నాయకుడు అశోక్ నేతృత్వంలో పాఠశాలల్లో పని చేస్తున్న, ఆయాలు, వాచ్‌మెన్‌లు, మధ్యాహ్న భోజన కార్మికులు అంతర్జాతీయ



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

శ్రామిక మహిళా దినోత్సవం ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏళ్ళ తరబడి కేవలం నెలకు రూ.3 వేల నుంచి రూ.6 వేల కోసం వివిధ కేటగిరీలలో పని చేస్తున్నామన్నారు. అయితే ఆ జీతాలు కూడా నెల నెల సక్రమంగా రావడంలేదని నెలల తరబడి పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అరకొర జీతాలతో కుటుంబాలు నెగ్గుకొస్తున్నామని ఆగ్రహించారు. ఇలాంటి సమయంలో ఆరోగ్యం సక్రమంగా లేకపోతే ఆసుపత్రికి వెళ్లడానికి అప్పులు చేయాల్సి వస్తుందన్నారు. ఆ అప్పులు తీర్చలేక మనోవేదన చెందుతున్నామన్నారు. ప్రభుత్వాలు మారినప్పుడెల్లా వారిని మార్చడం వేధించడం జరుగుతుందన్నారు. అతి తక్కువ జీతంతో ఎక్కువ పనులు చేస్తున్నారని, పాఠశాలలు సెలవులు ఉన్నా వారికి మాత్రం సెలవులు ఉండవని ఇది శ్రమ దోపిడి కాదా అని ప్రశ్నించారు. వారికి పీఎఫ్, ఈ ఎస్ఐ సౌకర్యం కల్పించాలని వాటి సాధనకు సంఘటితం కావాలని పిలుపునిచ్చారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ప్రగల్భాలు పలుకుతున్నారని అయితే మహిళలను అణచివేతకు గురి చేస్తున్నారన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ ప్రశ్నించే దిశగా ఎదగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆయాలు, వాచ్‌మెన్ మిడ్డేమీల్స్ యూ నియన్ జిల్లా నాయకులు రమేష్, మంజునాథ్, హరి, ప్రసూన్, ఏఐఎంఎస్ఎస్ మహిళా సంఘం నాయకులు రజనీ, శ్రీరాములు, మమత పాల్గొన్నారు.

విద్యుత్ అంతరాయాలతో తప్పని తిప్పలు

మడకశిరటౌన్, మార్చి9(ఆంధ్రజ్యోతి):మడకశిర పట్టణంతోపాటు గ్రామాల్లో సైతం తీవ్ర విద్యుత్ అంతరాయం ఏర్పడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గత వారం పది రోజుల నుండి గంట వ్యవధిలో ఒక్కసారైనా విద్యుత్ అంతరాయం నెలకొంటోంది. ఎప్పుడు వస్తుందో... ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితుల్లో పట్టణ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సబ్‌స్టేషన్‌లలో తరచూ మరమ్మతులు చోటు చేసుకొంటుండటంతో విద్యుత్ అంతరాయం అధికమవుతోంది. దీంతోపాటు ట్రాన్స్‌ఫార్మర్‌లు ఎక్కువగా ఏర్పాటు చేయడంతో విద్యుత్ సరఫరా ఆస్థాయిలో కాకపోవడంతో సమస్య ఉత్పన్నమవుతోందని అధికారులు అంటున్నారు. దాంతోపాటు లైన్‌లలో విద్యుత్ తీగలు తెగిపడటం, సకాలంలో మరమ్మతులు చేయకపోవడం వల్ల అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



మరమ్మతులకు గురవుతున్న సబ్‌స్టేషన్

ఇళ్లు కోల్పోయే వారికి న్యాయం చేస్తాం: జేసీ



కాలనీ వాసులతో మాట్లాడుతున్న జేసీ అభిషేక్ కుమార్

మడకశిరటౌన్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): రాయదుర్గం నుండి తుమకూరుకు వెళ్లే రైల్వే లైన్ నిర్మాణంలో మడకశిర పట్టణ సమీపంలో ఇళ్లు, స్థలాలు కోల్పోయే బాధితులకు న్యాయం చేస్తామని జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ తెలిపారు. రైల్వేలైన్ నిర్మాణంలో భాగంగా ఇళ్ల స్థలాలు కోల్పోయే మైనారిటీ కాలనీ వాసులు తమకు న్యాయం చేశాకే రైల్వేలైన్ నిర్మించాలని ఆదివారం ఆందోళనకు దిగారు. దీంతో జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ ఆర్డీఓ ఆనంద్‌కుమార్‌లు బాధితులతో మాట్లాడారు. మరోచోట స్థలం చూపడంతోపాటు నష్టపరిహారం చెల్లించేందుకు అవసరమైన చర్యలు తీసుకొంటామని హామీ ఇవ్వడంతో కాలనీవాసులు శాంతించారు.

జ్ఞానజ్యోతి శిక్షణకు అంగన్‌వాడీల నుంచి వసూళ్లా?

హిందూపురం అర్బన్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): ఇటీవల అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రభుత్వం ఆధ్వర్యంలో జ్ఞానజ్యోతి తరగతులు నిర్వహించారు. తరగతులు ముగిసిన తరువాత టీచర్లకు సన్మానం చేయడానికి ప్రతి కార్యకర్త నుంచి డబ్బు వసూలు చేసినట్లు సమాచారం. అదే విధంగా అంగన్‌వాడీల సమస్యల సాధనకు, జీతాల పెంపు, గ్రాట్యుటీ తదితర వాటిపై విజయవాడలో రాష్ట్ర వ్యాప్త సమ్మె చేపట్టారు. అయితే ప్రభుత్వం నుంచి అనుమతులు రాకపోవడంతో ఆ సమ్మె వాయిదా పడింది. ఈ సమ్మెకు అందరూ తప్పకుండా రావాలని హుకుం జారీ చేశారు. ఒక్కో వర్కర్ నుంచి రూ.300, ఆయా నుంచి రూ.200 ఇవ్వాలని గ్రూప్‌లలో మెసేజ్‌లు కూడా పెట్టారు. దీంతో చేసేది లేక చాలా మంది ఆయా సెక్టారు లీడర్లకు డబ్బులు అందించినట్లు తెలుస్తోంది. వెళ్లకపోయినా డబ్బు ఇవ్వాల్సి వచ్చిందే అని చాలా మంది ఆవేదన చెందుతున్నారు. ఇలా ప్రతి పనికి డబ్బు వసూలు చేస్తున్నారని అనుకుంటున్నారు. ప్రోగ్రాం వాయిదాతో వసూలు చేసిన డబ్బు వాపసు ఇస్తారా లేదా అని వర్కర్లు అడుగుతున్నట్లు తెలుస్తోంది. ఏది ఏమైనా ప్రతి పనికి సెక్టారు లీడర్ల ద్వారా డబ్బు వసూలు చేయడం పరిపాటిగా మారిందని ఆగ్రహిస్తున్నారు.

రేషన్ బియ్యం కోసం బఫర్ ఇబ్బందులు

రొళ్ల, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా పేద ప్రజల ఆకలి తీర్చేందుకు అందజేస్తున్న రేషన్ బియ్యం పంపిణీలో కొత్త సమస్య తలెత్తింది. అదే బఫర్ సమస్య. బఫర్ అనే పదానికి అర్థం చెప్పే నాథుడే కరువయ్యారు. మండలంలో రెక్కాడితేకాని డొక్కాడని కూలీలు అధికంగా ఉన్నారు. వారు సమీప కర్ణాటక ప్రాంతంలో పొట్టకూటి కోసం కూలీ పనులకు వెళ్లి నెలకోసారి బియ్యం కోసం వచ్చి రేషన్ షాపుల చుట్టూ తిరుగుతుంటారు. వారికి కనీసం రేషన్ బియ్యం సమయానికి అందించే వారు లేక అటు కూలీ పనులకు పోలేక అవస్థలు పడుతున్నారు. రొళ్ల మండలం మల్లినమడుగు గ్రామానికి చెందిన కూలీలు చెన్నకేశవులు, నారాయణ తదితరులు బియ్యం కోసం నానా అవస్థలు పడుతున్నామని వాపోయారు.

రెండు నెలలుగా బియ్యం అందలేదు: చెన్నకేశవులు,

నేను కూలీ పనులకు కర్ణాటక ప్రాంతం తుమకూరులో పనులకు వెళుతుంటాను. ఒకసారి వస్తే రూ.500 నుండి రూ.వెయ్యి వరకు ఖర్చవుతోంది. కానీ బియ్యం అందడం లేదు. గత నెలలో డీలరు థంబ్ వేయించుకొని బియ్యం ఇవ్వలేదు. ఈనెలలో కూడా బియ్యం ఇవ్వలేదు. అడిగితే వచ్చే నెలలో ఇస్తామని అంటున్నారు.

విద్యార్థుల రక్షణ బాధ్యత పోలీసులదే..



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఐ రాజకుళ్లాయప్ప

గుడిబండ, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు, మహిళలపై అఘాయిత్యాలు జరగకుండా పోలీసు వ్యవస్థ ముందు చూపుతో పనిచేస్తుందని ఎస్ఐ రాజకుళ్లాయప్ప పేర్కొన్నారు. ఆదివారం గుడిబండ ఎంజేపీ కళాశాలలో విద్యార్థినులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చక్కగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. విద్యార్థులు మహిళలు ఎవ్వరికీ భయపడకుండా ధైర్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. మహిళలు విద్యార్థులపై ర్యాగింగ్, అత్యాచారం, తదితర వంటివి జరగకుండా మండలంలో పోలీసు వ్యవస్థ రాత్రింబవళ్లు పనిచేస్తుందని అన్నారు. అనంతరం విద్యార్థినులకు పోలీసులు వివిధ వకృత్వపు పోటీలను నిర్వహించారు. ఈపోటీల్లో లక్ష్మీతులసి మొదటి బహుమతి, గౌతమి రెండో బహుమతి, జయశ్రీ మూడో బహుమతి సాధించారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ



ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎంపీ బీకే పార్థసారథి

పరిగి, మార్చి 9(ఆంధ్రజ్యోతి): నూతనంగా పైడేటి గ్రామంలో నిర్మిస్తున్న అభయాంజనేయస్వామి దేవాలయానికి హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి ఆదివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ప్రజల కోరిక మేరకు ఆలయ నిర్మాణానికి రూ.12లక్షలు ఎంపి నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ప్రజల సంక్షేమం గ్రామాల అభివృద్ధి పనులకై ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు సూచనలు ఇస్తున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ కన్వీనర్ గోవిందరెడ్డి, మారుతిప్రసాద్, ఎంఎన్‌టి కాంట్రాక్టర్ మహేశ్వర్‌రావు, సర్పంచ్ బాలాజీ, ఈశ్వరప్ప, శ్రీనివాసరెడ్డి, శేఖర్ పాల్గొన్నారు.

కన్నులపండువగా శ్రీవారి కల్యాణోత్సవం

మడకశిరటౌన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోట వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం శ్రీవారి కల్యాణోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. పుష్కర గోపురాల కుంబాభిషేకం, సంప్రోక్షణ, నూతన ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో భాగంగా స్వామివారికి ఉదయం నుంచే ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మహాపూర్ణాహుతి, శ్రీవారి రాజగోపురం, విమానగోపురాల కుంబాభిషేకం, ధ్వజస్తంభ సంప్రోక్షణ, జరిగాయి. సాయంత్రం 5 గంటల నుండి శ్రీవారి కల్యాణోత్సవ కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. అనేక మంది భక్తులు పాల్గొని స్వామివారికి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు.



ప్రత్యేక అలంకరణలో కోట వెంకటేశ్వరస్వామి

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

గోరంట్ల, మార్చి9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భజంత్రీ వీధికి చెందిన భాను శిరీషా కనిపించకపోవడంతో కేసు నమోదు చేసినట్లు సీఐ శేఖర్ తెలిపారు. గోరంట్లలోని భజంత్రీ వీధిలో నివాసముంటున్న ఈశ్వరమ్మ కుమార్తె భానుశిరీషకు కొంతకాలం క్రితం మనదపల్లి సమీపంలోని చిన్న తిమ్మమ్మపాడు గ్రామానికి చెందిన కేశవ్‌తో వివాహం జరిగింది. ఆమె పదిరోజులక్రితం పుట్టినిల్లు అయిన గోరంట్లకు వచ్చింది. అయితే గురువారం తిరిగి వెళతానని ఇంటినుంచి బయల్దేరినా అత్తింటికి చేరలేదు. పలుచోట్ల గాలించినా ఫలితం లేకపోవడంతో తల్లి ఈశ్వరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

యువతి ఆత్మహత్య

మడకశిర రూరల్, మార్చి 9 :(ఆంధ్రజ్యోతి):మండల పరిధిలోని గౌడనహళ్ళి గ్రామానికి చెందిన తమ కుమార్తె అనిత (18) ఆదివారం ఇంటిలో ఎవరు లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకొందని తల్లిదండ్రులు పోలీసులకు తెలిపారు. సమాచారం తెలుసుకున్న ట్రైనీ డీఎస్పీ కె ఉదయ పావని గ్రామానికి వెళ్ళి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతురాలు కుటుంబసభ్యులను విచారించారు. మంజూనాథ్‌తో వివాహమై ఆరు నెలలు కావస్తోందని, గత నాలుగు రోజుల నుంచి టైఫాయిడ్, కడుపునొప్పితో బాధపడుతుండేదని ఆదివారం మడకశిర ఆసుపత్రిలో చికిత్స కూడా చేయించినట్లు తెలిపారు మృతురాలు మడకశిరలో ఇంటర్ ద్వితీయ చదువుతోందని తెలిపారు. మృతురాలు తల్లిదండ్రులు నరసింహమూర్తి, సరస్వతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకుని దర్యాప్తుచేసున్నట్లు ట్రైనీ డీఎస్పీ కె ఉదయ పావని తెలిపారు.

చింతచెట్టు నుంచి పడి వృద్ధుడి మృతి

అమరాపురం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పేలుబండ గ్రామానికి చెందిన రామన్న(70) అనే వ్యక్తి బసవనపల్లి గ్రామ సమీపంలో చింతపండు కొట్టేసమయంలో చెట్టునుండి కాలుజారి కింద పడ్డాడు. దీంతో హుటాహుటిన అతడిని మడకశిర ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఈఘటనపై భార్య తిమ్మక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మడకశిర ప్రభుత్వ ఆస్పత్రిలో శవపరీక్ష నిర్వహిస్తున్నట్లు స్థానిక పోలీసు హెడ్‌కానిస్టేబుల్ మధు తెలిపారు. మృతునికి ఇద్దరు మగ సంతానం, ఒక కుమార్తె ఉన్నట్లు తెలిపారు.



రామన్న మృతదేహం

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

హిందూపురం, మార్చి 9(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని యువకుడు చెట్టుకు తాడుతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన హిందూపురం పట్టణ పమీపంలోని సిరికల్చర్ కార్యాలయం సమీపంలో చోటు చేసుకుంది. రైల్వే స్టేషన్ సమీపంలోని సిరికల్చర్ కార్యాలయం ఆవరణంలో సుమా రు 30 సంవత్సరాల వయస్సు కలిగిన యువకుడు శనివా రం అర్ధరాత్రి చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు భావిస్తున్నారు. ఆదివారం ఉదయం స్థానికులు గమనించి టూటౌన్ పోలీసులకు సమాచారం అందించారు. వారు సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహన్ని శవ పంచనామా నిమిత్తం హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని విచారిస్తున్నారు.

ఐషర్ వాహనం ఢీకొని వ్యక్తి మృతి

పరిగి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నేతులపల్లి గ్రామ సమీపంలోగల కొడికొండ-శిర హైవేలో పెన్నానది బ్రిడ్జిపై ఐచర్ వాహనం ఓ ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో దానిపై ప్రయాణిస్తున్న వ్యక్తి మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. ఎస్ఐ రంగడు యాదవ్ తెలిపిన వివరాల మేరకు కర్నాటక రాష్ట్రం విరుపసముద్రం హరిజన నరసింహమూర్తి (35) బేల్దార్ పనులకై ముద్దిరెడ్డిపల్లికి వెళ్లి తిరిగి వస్తుండగా పెన్నానది వంతెనవద్దకొడికొండ వైపు వెళ్తున్న ఐచర్ వాహనం ఢీకొంది. దీంతో నరసింహమూర్తి అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీస్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని శవాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. భార్య గంగమ్మ, గంగాదేవి ఫిర్యాదుమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతునికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.



నరసింహమూర్తి (ఫైల్)

హేమావతి గ్రామంలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం

అమరాపురం, మార్చి 9(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన శ్రీహెంజేరు సిద్దేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు వచ్చిన దుకాణాదారులు హోటళ్ల వారు వదిలి వేసిన చెత్తను, ప్లాస్టిక్ కవర్లు, చెత్తకుప్పలను ఆదివారం తొలగించారు. ఆలయ పరిసరాలు, చుట్టుపక్కల ఉన్న ఈ చెత్తను పంచాయతీ కార్మికులు తొలగించారు. ఈకార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నరేష్‌బాబు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్ఐ కౌన్సెలింగ్

సోమందేపల్లి, మార్చి 9(ఆంధ్రజ్యోతి): పనిపాటు లేకుండా రోడ్లపై జులాయిగా తిరుగుతున్న యువతకు ఎస్ఐ రమేష్ ఆదివారం స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ప్రతి యువకుడు బాధ్యతగా మెలగాలన్నారు. చెడు వ్యసనాలకు లోనై డ్రగ్స్‌లాంటి అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. స్నేహితులతో కలిసి గంజాయి లాంటి మత్తు పదార్థాలకు అలవాటు పడితే భవిష్యత్తు అంధకారంగా మారుతుందన్నారు. అసాంఘిక కార్యక్రమాల్లో పట్టుబడితే కేసులు నమోదు చేస్తామన్నారు.